క్లుప్తంగా

ఉపాధ్యాయుడి ప్రతిభ


ప్రసాద్ గీసిన కలెక్టర్ చిత్రం

కురిచేడు: మండలంలోని బోధనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ (స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయుడు చక్కిలం ప్రసాద్ కళానైపుణ్యం ఆకట్టుకుంటోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు స్కాచ్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయన ఆమె చిత్రాన్ని గీశాడు. అచ్చుగుద్దినట్లు కలెక్టర్ చిత్రం వేశారు. ఇది ఫొటోనా? లేక ఆర్ట్ వేశారా? అని గుర్తించలేని విధంగా చిత్రం వేయడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందిస్తున్నారు.

ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేయాలి

పుల్లలచెరువు: సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో సర్వే నిర్వహించేటప్పుడు తప్పనిసరిగి ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు అడిగి సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో వసంతరావునాయక్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏటీపీలు అడిగే సమయంలో ఎక్కడో ఉండి అడిగితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇబ్బందిగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్దకు వెళ్లి తగు వివరాలతో సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దర్శి: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ హసీనాభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆఖరి తేదీ ఈ నెలాఖరని స్పష్టం చేశారు.

ఇంటర్‌లో ప్రవేశానికి కూడా..

ఏపీ ఆదర్శ పాఠశాల దర్శిలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ (ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ) ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హసీనాభాను చెప్పారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్లో సంప్రదించాలని కోరారు.

నువ్వుల్లో దిగుబడి పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు: నువ్వులను ఆరుతడి పంటగా వేసవిలో వేసినప్పుడు చీడపీడల బెడద తక్కువగా ఉండి విత్తన నాణ్యత పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని తాళ్లూరులో నువ్వుల పంట సాగు చేసే రైతులకు పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలు మండిపోతున్న కారణంగా నీటి తడులు అందించాలని, ముఖ్యంగా పూత, కాయ అభివృద్ధి, గింజ కట్ట దశలో ఉన్నప్పుడు తప్పకుండా తడి అందించాలని, తద్వారా దిగుబడులు పెరుగుతాయని ఏవో తెలిపారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు, శ్రీశైలం వెళ్లే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.


తూర్పుగంగవరం రామాలయం సమీపంలో..


మాధవరం కాండ్ల వాగులో జంతు కళేబరాలు తింటున్న కుక్క

గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- రోడ్ల పక్కనే జంతువుల కళేబరాలు
- పట్టించుకోని పాలకులు

తాళ్లూరు:

మండలంలోని వివిధ గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. 16 పంచాయతీల్లోని కొన్ని గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. చనిపోయిన జంతు కళేబరాలను సైతం ప్రధాన రహదారి పక్కన పడేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఉన్న తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టును తయారు చేసి రైతులకు అమ్మేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామంలోని ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల నుంచి వచ్చిన వ్యర్థాలను కాలువల్లోకి వదిలేస్తున్నారు. కాలువల్లో చెత్త నిండుకుని ఉండటంతో వర్షం నీరు వెళ్లే మార్గం లేక అక్కడే నిలబడిపోతోంది. పూడికతీత పనులు చేసిన దాఖలాలు లేవు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విజృంభిస్తున్నాయి.


నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ఎంపీపీ స్వగ్రామంలోనూ అంతే..

తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు స్వగ్రామం మాధవరంలో కూడా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. తూర్పుగంగవరం నుంచి తాళ్లూరు వెళ్లే రోడ్డు, మాధవరం గ్రామంలోని కాండ్లవాగు, పీతురువాగులో జంతు కళేబరాలు దర్శనమిస్తున్నాయి. చనిపోయిన మేకలు, గొర్రెలు, బర్రెలు, దూడల కళేబరాలను పూడ్చి పెట్టకుండా గోతాల్లో కట్టి రోడ్డు పక్కనే పడేస్తున్నారు. వాహనాదారులు ముక్కు పట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. దుర్వాసనకు తట్టుకోలేకపోతున్నామని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు బహిరంగ సభల్లో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్పా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

> **కూటమి ప్రభుత్వంలో పారిశుధ్యం అధ్వానం:**
> కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. జంతు వ్యర్థాలు వాగు నీటిలో కలవడంతో పశువులు ఆ నీరు తాగి రోగాల బారిన పడుతున్నాయి. గ్రామాల్లో విషజ్వరాలు విజృంభించే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి
>
> ఐవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

నేడు ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

దర్శి: దర్శనాపురి నగర క్షేత్ర పాలకుడు శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి 55వ తిరునాళ్ల మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు రెండు లక్షల మంది వరకు హాజరవుతారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మహిమాన్విత చరిత్ర

గతంలో దర్శిని ఒక మహాయోగి సందర్శించారు. దర్శిలో రామాలయం ఉందిగానీ ఆలయంలో ఆంజనేయుడు లేడని తనకు తాను ప్రశ్నించుకున్నాడు. ఆయన నిత్య సాధన సంపత్తితో శ్రీరామచంద్ర మూర్తి స్వామి వారికి వాయువ్య దిశలో ఉత్తరాభిముఖంగా తానే స్వయంగా క్రీస్తు శకం 3వ శతాబ్దంలో శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామిని ప్రతిష్ఠించినట్లు పెద్దల నానుడి. 13వ శతాబ్దంలో 1324 సంవత్సరంలో కాకతీయ ప్రతాపరుద్రుడు ఆలయాన్ని దర్శించి శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాలకు మాన్యాలు ఇచ్చినట్లు చరిత్రకారులు చెప్తున్నారు. దేశంలో ప్రతి ఆంజనేయ స్వామి ఆలయం పైకప్పు ఉంటుంది. ఇక్కడ ఆంజనేయ స్వామి ఆలయానికి మాత్రం పైకప్పు ఉండదు. ఎండకు ఎండాలి.. వర్షానికి తడవడం స్వామి ప్రత్యేకత. ఈ స్వామి దర్శి నగర క్షేత్ర పాలకుడని, పీడ, పిచాచాలను తరిమి ఆమడ దూరంలో ఉంచుతాడని ఆలావాలం. శ్రీరామచంద్రునికి అభిముఖంగా ఉండి ఆయన వెలుగును దర్శించే రాతి దీప స్తంభం ఆలయంలో ఉంది. ఆ స్తంభంపై భక్తులు దీపం వెలిగిస్తుంటారు. స్వామిని ఎందరో యోగ దృష్టి కలవారు, ఆది కవులు దర్శించారు. శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు మార్కెల్ల వెళ్తూ ఇక్కడ క్షేత్రాన్ని దర్శించారు. మిట్టపాలెం నారాయణ స్వామి తన అమ్మమ్మగారి ఊరు ముండ్లమూరు మండలం భీమవరం వెళ్తూ ఇక్కడ స్వామి వారిని దర్శించే వారు. ఆది కవులైన శ్రీనాథుడు, ఎర్రన, పోతన, తిమ్మన, ప్రోలయ వేమారెడ్డి వంటి మహానుభావులు దర్శించి పూజించిన దివ్యక్షేత్రం శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయం. ఇక్కడ స్వామిని మొక్కిన వారి కోర్కెలు తీరుస్తాడని భక్తుల విశ్వాసం.


భక్తుల దర్శనానికి ఏర్పాట్లు..

ఎమ్మెల్యే బూచేపల్లి శుభాకాంక్షలు

తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. అంతా స్వామి వార్ల కృపకు పాత్రులు కావాలని బూచేపల్లి కోరారు.


పూజలందుకుంటున్న స్వామి వారు

చలివేంద్రం ప్రారంభం

కురిచేడు: వేసవికాలం ఆరంభమై ఎండలు మండుతుండటంతో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గురువారం చలివేంద్రం ప్రారంభించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నుసుం సుబ్బారెడ్డి తన మనమడు గూడిపాటి వియ్యన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఎండల తీవ్రత తగ్గే వరకూ చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. చలివేంద్రాన్ని మేరువ పిచ్చిరెడ్డి, నుసుం సుబ్బారెడ్డిలు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా చిన్నారులు కేక్ కట్ చేసి వియ్యన్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ కానాల శివారెడ్డి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్‌లు పోలిరెడ్డి నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, నాయకులు దర్గారెడ్డి, పెండ్యాల గురునాథం, ఇందూరి సుబ్బారెడ్డి, షేక్ మౌలాలీ, కాటం పున్నారెడ్డి, కాటం పెద్దిరెడ్డి, కోడూరి శ్రీను, నుసుం గురవారెడ్డి, కొండలు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

చెరువు మట్టి తోలకాలు ఆపాలి

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పోలవరంలో చెరువు మట్టి తోలకాలు వెంటనే నిలిపేయాలని గ్రామస్తులు కొర్రపాటి అనీల్, పి.కృష్ణ, కె.సుమన్, జీతేంద్ర సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొర్రపాటి అనీల్ మాట్లాడుతూ గతంలో మీడియా సమావేశాలు పెట్టి తమ ఇబ్బందులు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని చెప్పారు. టిప్పర్లలో నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు అడ్డుకుంటే బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి తోలకాలతో బోర్లలో నీరు ఎండిపోయి, పొలాలకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తుడు

నేడు ఎమ్మెల్యే తాటిపర్తి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మాచర్ల రోడ్డులోని ముస్లిం షాదీ ఖానాలో నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ విందులో ఆయా మండలాల ముస్లిం నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే తాటిపర్తిని సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు, నాయకులు

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా జిల్లా కమిటీలో పదవి పొందిన జిల్లా మానిటరింగ్ కార్యదర్శి దోమకాలు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం యర్రగొండపాలెంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల నాయకులతో కలిసి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, ఆవుల రమణారెడ్డి, వెంకటేశ్వరనాయక్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, ఎంపీటీసీలు ఎల్.రాములు, యోగిరెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డి, మండల సీనియర్ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, బి.సుబ్బారెడ్డి, గడ్డం సుబ్బయ్య, నాసర్‌రెడ్డి, వీరారెడ్డి, మల్లారెడ్డి, ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొనకొండ ప్రాంత వాసులకు

ఆర్టీసీ బస్సుల సమాచారం

దొనకొండ: మండల కేంద్రం దొనకొండ నుంచి దర్శి, గంగవరం, చీమకుర్తి మీదుగా ఒంగోలు వెళ్లేందుకు ఫస్ట్ బస్సు ఉదయం 5.30 గంటలకు, ఆ తర్వాత 7.45 గంటలకు, ఆ తర్వాత 9.30 గంటలకు, 10.15 గంటలకు, మధ్యాహ్నం 1.45 గంటలకు, మళ్లీ 3.45 గంటలకు దొనకొండ నుంచి ఒంగోలుకు బస్సులు బయల్దేరతాయి. అదే మార్గంలో ఒంగోలు నుంచి దొనకొండకు ఫస్ట్ బస్సు ఒంగోలు డిపోలో ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు, 1.45 గంటలకు, ఆ తర్వాత 3.45 గంటలకు, సాయంత్రం 5.45 గంటలకు, లాస్ట్ బస్సు దొనకొండలో నైట్ హాల్ట్ సాయంత్రం 6.45 గంటలకు ఒంగోలులో బయల్దేరుతుందని పొదిలి డిపో మేనేజర్ వి.శంకరరావు తెలిపారు. గతంలో పొదిలి నుంచి యర్రగొండపాలేనికి బస్సు సౌకర్యం ఉండేది. కొన్ని నెలలుగా ఆ బస్సును రద్దు చేశారు. ప్రజల కోరిక మేరకు తిరిగి పునః ప్రారంభించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు పొదిలిలో ఉదయం 5.40 గంటలకు బయల్దేరి దొనకొండకు 6.15 గంటలకు వస్తుంది. 8.30 గంటలకు యర్రగొండపాలెం చేరుతుంది. మళ్లీ ఈ బస్సు యర్రగొండపాలెంలో 9 గంటలకు బయల్దేరి 11 గంటలకు దొనకొండ వచ్చి 12 గంటలకు పొదిలి చేరుతుంది. కొన్నేళ్లుగా పుణ్యక్షేత్రం శ్రీశైలానికి ఈ ప్రాంతం నుంచి బస్సు సౌకర్యం లేదు. దొనకొండ నుంచి మార్కాపురం వరకు రైల్లో వెళ్లి అక్కడి నుంచి బస్సుకు వెళ్లాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఒంగోలు, చీమకుర్తి, గంగవరం, దర్శి, దొనకొండ, కొచ్చెర్లకోట, కుంట మీదగా బస్సు నడిపితే బాగుంటుందని ఈ ప్రాంత వాసుల కోరుతున్నారు. ప్రయాణికులు తమతో మాట్లాడాలంటే 73828 25700, 99592 25700 నంబర్లలో సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారులపై తోకపల్లి రైతుల ఆగ్రహం


ఆర్‌ఐ గోపితో వాగ్వాదానికి దిగిన తోకపల్లి రైతులు

పెద్దారవీడు: తమ పట్టా భూముల సర్వే నంబర్లను గ్రామానికి చెందిన మేకల శంకరరావు పేరుపై ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేశారని రెవెన్యూ అధికారులను తోకపల్లి గ్రామానికి చెందిన రైతులు ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ధర్నా చేశారు. రెండు నెలల క్రితం రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియాకు అర్జీ ఇచ్చామని రైతులు చెప్పారు. రైతులు ఆర్‌ఐ గోపి వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో ఎలా ఎక్కించారని ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో ఎక్కించామని అధికారులు ప్రకటించారు. ధర్నాలో బిట్ర తిరుమలమ్మ, చేతుల రమణమ్మ, చింతా మరియమ్మ, ఉప్పలపాటి చిన్నపొట్టయ్య, చింత ఎస్తేరమ్మ, కొత్తా నాగయ్య, చేతుల రమణమ్మ, చేతుల చలమయ్య పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: కేజీబీవీలో ప్రవేశాల కోసం ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి జి.మమత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం 8, 12 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ కోసం బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 మంది, 11వ తరగతిలో 40 మంది దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, అనాథలు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్లకు పరిగణిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. పూర్తి వివరాలకు 85003 29032 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరావు

తాళ్లూరు: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ మల్లికార్జునరావు సూచించారు. ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు అధిక శబ్ధాలతో వేగంగా నడపడంతో జరిగే నష్టాల గురించి ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మల్లికార్జునరావు హెచ్చరించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి


మాట్లాడుతున్న హనుమంతురావు

దర్శి: ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కోటంశెట్టి హనుమంతురావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట తమ జీతాలు చెల్లించాలని కోరుతూ కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ ఎన్నిమార్లు అధికారులను, కాంట్రాక్టర్‌లను జీతాలు చెల్లించాలని కోరినా స్పందించడం లేదన్నారు. ఈ నెల 22వ తేదీలోపు జీతాలు చెల్లించకుంటే అన్నీ గ్రామాలకు నీటి సరఫరా నిలిపేస్తామని హెచ్చరించారు. ఆ రోజు నుంచి సంబంధిత కార్యాలయం ఎదుట ధర్నాకు కూర్చుంటామన్నారు. కార్యక్రమంలో జూపల్లి కోటేశ్వరరావు, మొగిలి శ్రీను, ఆరునూరి బాబు, దేవండ్ల దేవి పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పూరిమెట్ల నాగార్పమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. హుండీని గుడి వెనుకాలకు తీసుకెళ్లి పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.30 వేలకుపైగా నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఇటీవల దేవాలయాల్లో వరుస దొంగతనాలు జరగడంతో భక్తులు బెంబేలెత్తుతున్న సంగతి తెలిసిందే. మళ్లీ నాగార్పమ్మ ఆలయంలో దొంగతనం జరగడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామాల్లో సీసీ కెమెరాలు బిగించినా వాటిని కూడా తప్పించుకుని దొంగలు పడుతున్నారంటే ఇది పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఇటీవల బొప్పూడివారిపాలెం, జమ్మలమడక, ముండ్లమూరు గ్రామాల్లో భారీ దొంగతనాలు జరిగిన విషయం తెలిసిందే. దొంగలు దేవాలయాలనే టార్గెట్ చేయడంపై ప్రజలు విస్తుపోతున్నారు.


ఆలయంలో పగులగొట్టిన హుండీ